# అస్థిపంజరం

అది ఎనాటమీ లాబొరెటరీ. క్షమించాలి. స్వరాజ్యం వచ్చాక అతి సులువైన ఇంగ్లీషు మాటలకి అతి తికమక పెట్టే సంస్కృత శబ్దాలు నిఘంటువుల్లోంచి ఏరుకు రావటం, అది మన జాతీయతకి సాఫల్యమని ఉప్పొంగటం అలవాటైపోయింది. కనుక దాన్ని శల్యశాస్త్ర బోధనాలయం అంటాను. ఈ పదం నెక్టైని కంఠలంగోటీ, బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్‌న్ను వితంతీ గృహము, రైస్ ఎక్స్‌పర్ట్‌ని తండులశాస్త్రీ అన్నంత జాతీయంగా లేకపోవచ్చు. దాన్ని ఏ పేరుపెట్టి పిలిచినా మన కథకేం ప్రమాదంలేదు. అది వేళ్లాడే అస్థిపంజరాలకి అంతఃపురమని తెలుసుకుంటే చాలు.

మిగతా విద్యార్థి విద్యార్థినీ బృందం ఒక్కొక్క అస్థిపంజరం ముందు ఒకొకళ్లు నిలబడి దాని ఎముకలని పేరుపేరునా పాయింటరుతో పొడిచి శ్రద్ధగా పరిశోధిస్తున్నారు. కుర్చీనో, బల్లనో, చెట్టునో, పిట్టనో చూసినట్లే వాళ్లు ఆ అస్థిపంజరాలని పరీక్ష చేసి పాఠాలు నేర్చుకుంటున్నారు.

కాని నేను మట్టుకు పాయింటర్ బల్లమీద పడేసి నా ముందున్న ఎముకలగూడు కేసి చూస్తూ స్తంభించిపోయాను. గాలికి ఆ ఎముకలపోగు వికృతంగా అటూ ఇటూ కదులుతోంది. నున్నటి తలా, తొర్రలుపడిన కళ్లూ, క్రూరంగా ఇకిలిస్తున్నట్లున్న పళ్లూ చూస్తూంటే నా వొళ్లు జలదరించిపోయింది. అది ఒక మాజీ మానవ రూపం అనే సంగతి నా హృదయాన్ని, బాణంలాగా గుచ్చుతోంది. చీకటి గుంటల్లాగా వున్న ఆ కళ్లతొర్రలు "ఇంతే,

నువ్వూ ఇంతే!" అనే ఘోరమైన సత్యాన్ని నాకు హెచ్చరిక చేస్తున్నట్లనిపించింది. స్మశానంలో చితిమంటలూ, మరుభూమిలో గోరీలూ కళ్లలో కదిలి మానవ జీవిత నాటకమంతా ఒక్క-క్షణంలో నా ముందు మెరిసినట్లయింది. నా ముందున్న అస్థిపంజరం పుల్లల్లాగా వున్న తన చేతులతో నా మెడని చుట్టివేస్తున్నట్లనిపించి ఉలిక్కి పడ్డాను. కెవ్వున కేకవెయ్యబోయి నోరునొక్కుకొని పెదవి కరుచుకున్నాను. మూగభాషలో ఆ కంకాళం నన్ను "తమ్ముడూ!" అని పిలిచినట్లయింది. అవును మరణప్రాంగణంలో అందరం అన్నదమ్ములమే, అక్కచెల్లెళ్లమే! ఆ రాజ్యంలో పాదుషా ఫకీరూ అన్నదమ్ములే.

"ఎవరు నువ్వు? నాతో ఏం చెప్పాలని నువ్విల్లా పరిత పిస్తున్నావ్? నామీద చెయ్యితియ్యి. చెప్పు."

"మీద చెయ్యివేస్తే అంత భయందేనికీ? ఇంత అసహ్యం దేనికీ? ఒకప్పుడు ఈ చెయ్యి ఎంత బాగుండేదనుకున్నావ్! గొప్ప శిల్పి చెక్కినట్లుగా, పచ్చని శరీరంతో, మెత్తని మాంసంతో గుండ్రంగా నునుపుగా, కొనసాగిన వేళ్లతో ప్రేమపాశంలాగా వుండేది. ఇప్పుడు నే చెబితే మాత్రం నువ్వు నమ్ముతావా?" అని తొర్రకళ్లు నాకేసి జాలిగా ప్రశ్నించినయ్.

"ఎందుకు నమ్మనూ? చెప్పు. అప్పుడు నువ్వు ఎట్లావుండే దానివి? ఇక్కడికి ఎప్పుడొచ్చావు? ఎల్లా వచ్చావ్?" అని అడిగాను.

"నిజంగా ఇవన్నీ వినాలనుకుంటున్నావా? నన్ను ఒకప్పటి మనిషిగా గుర్తించినవాడివి ఇన్నాళ్లకి దొరికావు. నా అదృష్టం. నువ్వూ అందరిలాగే బెత్తంపట్టి నన్నుపొడిచి నాతోచెలగాట మాడ టానికి వచ్చావనుకున్నాను. అయితే చెపుతాను మరి. అదంతా

ఒక పెద్దకథ. విసుగెత్తి మధ్యతో వెళ్ళిపోవు కదా?" అని ఆ కంకాళం తలవూపుతూ అడిగింది.

"వెళ్లను. పూర్తిగా వింటేకాని కదలను" అన్నాను. గోడ మీద బల్లి మా మూగసంభాషణంతా వింటున్నట్లుగా తోకఆడిస్తోంది. హాలులో గాలిపంకా మోత తప్ప ఇంకే చప్పుడూ లేదు. మిగతా విద్యార్థులంతా బుద్ధిమంతుల్లాగా పాఠాలు శ్రద్ధగా నేర్చుకుంటు న్నారు. నేను మటుకు ఏదో ఇంద్రజాలంలో చిక్కుకున్న వాడి లాగా అక్కడే నిలబడిపోయి వింటున్నాను.

"ఈ ఎముకల గూడుకు ఒకప్పుడు ఎంతో అందమైన స్త్రీ శరీరం కప్పి వుండేదని, ఆ శరీరశోభ ఎందరి హృదయాలనో బానిసలు చేసుకోగలిగిందనీ నువ్వు నమ్మగలవా! నున్నగా నిగనిగ లాడుతూ భయంకర గోళంగా వున్న ఈ తల ఒకప్పుడు నొక్కులు తిరిగి తుమ్మెద రెక్కలని వెక్కిరించే చక్కటి శిరోజాలతో అలరారిందని నమ్మగలవా?"

"ఆఁ. ఎందుకు నమ్మను?" అన్నాను కొంచెం విసుగ్గా— అందం చూసుకుని గర్వపడే ఆడబుద్ధి ఇంకా ఈ అస్థిపంజరాన్ని కూడా విడవలేదేమా అని ఆశ్చర్యపోయాను. తొందరగా తన కథ చెబితే వినాలనే కుతూహలంతో ఈ వర్ణనలు నాకు కొంచెం తలనొప్పిగానే తోచినయ్. కాని వర్ణనలో పడిన రచయిత ఎక్కడ మునిగి ఎక్కడ తేలుతాడో ఎవరికీ తెలియదు, తిరిగి అతను వచ్చేదాకా కథ నిలబడుతుందేమో కాని చదువరి ఓపిగ్గా నిలబడ తాడని హామీలేదు. అయినా వర్ణించటంలో మునిగి పోయిన రచయితలాగా ఈ కంకాళం ఎందుకల్లా తన అందాన్ని గోరంతలు కొండతలుచేసి చెబుతున్నదా అని అనుమానం వేసింది. భయమూ వేసింది. విషయమూ సంఘటనా తక్కువైన కథలో వెలితిని

వర్ణనతో కప్పటానికి ప్రయత్నంచేసే రచయిత ధోరణిలో పడటాన్ని బట్టి అసలు చెప్పవలసిన కథ ఏమీలేదా అనే సందేహంతో ముఖం చిట్లించాను. ఈ అస్థిపంజరం భలే తెలివైనది లాగా వుంది. నా వూహల్ని గ్రహించింది కాబోలు, ఛటుక్కున కథలోకి దిగింది.

"బతికున్న రోజుల్లో ఒక పల్లెటూరి రైతు పడుచును. నా పేరూ, వూరిపేరూ సరిగా గుర్తులేవు. అప్పుడు చాలా రూపసిని. ఊళ్లో—యువకు లందరి కళ్లూ—నామీదే. కాని నా తండ్రి బీద వాడు. వానలులేని ఏడాది ఒకసారి గురవయ్య మామ కొంత డబ్బు అప్పిచ్చి ఆదుకున్నాడు. లేకపోతే తిండికి అల్లాడి పోయే వాళ్లము. ఆ మామకి ఆ మధ్యనే పెళ్ళాం పోయింది. కాని ఇంకో పెళ్లిమీద యావమట్టుకు పోలేదు. మెల్లకన్నూ, గూనివీపూ, బట్ట తలా, చప్పి దవడలూ పగలు చూస్తే రాత్రి కలలోకి వస్తాడు. పిల్లలు అన్నం తినక మారాం చేస్తుంటే తల్లులు 'అడుగో; గూని గురవయ్య వస్తున్నాడు!' అనగానే గప్‌చిప్‌గా అన్నం తినేవారు.

"ఆ అందాల నలకూబరుడి కన్ను నామీద పడింది. పిల్లనిస్తే బాకీచెల్లు. లేకపోతే అణాపైసలతో నిలుచున్న పాశాన కక్కి తీరాలి అని నాతండ్రిని వొత్తిడిచేశాడు. మొదట మోరాయించినా నాతండ్రి మెత్తపడక తప్పిందికాదు. కాని నాకు సుతరాం ఇష్టం లేదు. అర్ధరాత్రి కాలవలో దూకి ప్రాణం తీసుకుందామని వెళ్లాను. దూకబోయే వేళకి ఎవరో చెయ్యిపట్టుకుని వెనక్కి లాగారు. కొత్తవాడయినా ఆ మనిషి కండలు తిరిగిన శరీరం, ఉంగరాల క్రాపు, నవ్వుముఖమూ చూసీచూడటంతోటే నాకు ఎదో పూర్వ జన్మలో ఎరుగున్న ఆప్తబంధువుని మళ్లీ కలుసుకున్నంత ఆనందం

కలిగింది. 'ఇక్కణ్నుంచి ఎవరికీ తెలియకుండా దూరంగా పారి పోదాం అక్కడ హాయిగా కాలంగడుపుదాం' అన్నమాటలు పన్నీటి జల్లులాగా, తీయని సంగీతంలాగా అనిపించి తలవూపాను.

"ఆ ఎరగని మనిషి నాటకాల జట్టుతో ఊరూరా తిరుగుతూ అక్కడికి వచ్చాడు. పేరు నాయుడుబావట! ఎవరైతేనేం మృత్యు ముఖంలోంచి వెనక్కి తీసుకొచ్చి జీవిత మార్గంలో నిలబెట్టాడు.

"నా వాళ్ల కెవరికీ ఆచూకీ తెలియనంతదూరం పారిపో యాము. కాని వూళ్లో కాపరంపెట్టాము. కానీ సంపాయించటం చేత కాదు బావకి. నాటకంలో వేషంకట్టి పద్యాలూ పదాలూ చదవటం తప్ప ఇంకోపని చెయ్యటం అంటే అతనికి ఎంతో నామర్దా. ఆ వూళ్లో నాటకాల సరదా ఎవరికీ లేదు. రాజవేషం వేసినవాణ్ని కూలినాలి చేస్తానా అని మీసం మెలివేసేవాడు. నా వొంటిమీ దున్న బంగారం కొంచెం కొంచెం కరిగించి కాలం వెళ్లదీస్తో వున్నాను. బావ నా ఎదటవుంటే నాకు ఇంకేమీ అక్కర్లేదనిపించేది. ఆ విశాలమైన ఛాతీ, ఆ గిరజాల క్రాపూచూస్తూ పొంగి పోయేదాన్ని, 'ఏదిబావా ఇల్లారా! ముఖాన బొట్టుపెట్టుకోవాలి' అంటూ బావ దగ్గిరగా వెళ్లి అద్దాలలాగా వున్న అతని చెక్కిళ్లలో నా నీడని చూసుకునేదాన్ని. నవ్వుతూ కుంకందిద్దుకుంటూ 'నువ్వుంటే అద్దం ఎందుకు బావా?' అనేదాన్ని. ఆ రోజుల్లో బావకూడా చాలా మోజుగా వుండేవాడు. గుడిసెలో దీపంగభాలున ఆర్పేసి 'అదేంటిబావా?' అంటే 'నీ కళ్ల తళతళలు చాలులే? ఇంకెందు కా దీపం?' అనేవాడు.

"కొన్నాళ్లకి నామెళ్లో చిన్నంఎత్తు బంగారంలేకుండాహరించి పోయింది. రోజుగడిచే దారిలేదు. అయినా బావ నాటకాల్లో చక్ర వర్తివేషం వేశాననే సంగతి మరిచిపోయి కాలుకదపడు. బైటికి

వెళ్లడు. వేలువంచడు. కానీ ఇంటికి పట్టుకురాడు. కాని భోగాలలో ఏకాస్త లోటయినా మండిపడతాడు.

"అయినా నేనుబావని ఏమీ అనేదాన్ని కాదు. బావ కష్ట పడటం నాకే లోపల ఇష్టంవుండేది కాదు. అందుకే నేను దొరికిన ప్రతిపనీ చేసి తృణమో పణమో తేవటం మొదలు పెట్టాను. భార్య కష్టపడి తెస్తుంటే బావ కాలుమీద కాలువేసుకుని మీసం మెలి వేస్తూ బీడీలు తగలేస్తూ దర్జాగా వుండేవాడు. పాచిపని చేసేదాన్ని. కేరియర్లు మోసేదాన్ని. పని దొరికినప్పుడు పొగాకు కంపెనీకి వెళ్లే దాన్ని. నిమిషం విరామంలేకుండా పాటుపడి ఇద్దరి పొట్టలూ నేనే నింపుతూ వుండేదాన్ని,

"బండచాకిరీ వల్ల నా వొళ్లు చెడిపోయింది. అందమంతా మబ్బుచాటునవెన్నెలలాగా మాయమౌతోంది. ఆయాసం,దగ్గూపట్టు కొని పీడిస్తుంటే మంచాన పడ్డాను. రెక్కాడితేకాని డొక్కాడని స్థితిలోకూడా బావ టెక్కు తగ్గలేదు. పైగా ఎక్క డెక్కడో తిరిగి అర్ధరాత్రిదాకా కొంపకి చేరేవాడు కాదు. పలకరిస్తే కస్సు మనేవాడు. నోరారా పిలిచి ఎన్నాళ్లో అయింది. బావ ఎందుకిలా మారిపోయాడా అని మనస్సు ఎంతో అల్లాడి పోయింది. అల్లాగే లేవలేని స్థితిలో పడుతూ లేస్తూ చాటుగా ఒక చీకటిరాత్రి బావ వెంట నడిచి వెళ్ళాను. నా కళ్లని నేనే నమ్మలేక పొయ్యాను. కాళ్లు గజగజ వణికిపోయినయ్. గుండె భగ్గున మండింది. గిరుక్కున వెనక్కి తిరిగాను. నాకూ బావకీ మధ్య ఇంకో స్త్రీ. అందుకనే నాయుడు బావ, తన ప్రాణంతో సమానంగా చూసుకునే బావ, నా వొంట్లో ప్రతి రక్త బిందువునీ నవ్వుతూ సమర్పిస్తే స్వీకరించిన బావ ఇలా మారిపోయాడు కాబోలు తల తిరిగి పోయింది.

"ఇంకో రోజు నేను మూలుగుతూ మంచాన పడివున్నాను. ఆ మనిషిని వెంట బెట్టుకుని ఇంటికి వచ్చాడు బావ. తను పదం పాడుతుంటే ఆ మనిషి—అడుగులతో తాళంవేస్తోంది. ఒకటే సరసాలూ, నవ్వులూ. ఆ మనిషి సిగలోంచి వస్తున్న మల్లెపూల వాసనకి నా మనస్సు అట్టుడికిపోయింది. అక్కడ క్షణంకూడా నిలవలేక బయలుదేరాను. నేను వున్నాననే సంకోచమేలేదు. నేను వున్నా లేనిదానిలో జతే అయింది. దీపం వెలుగులో ఆ మనిషి ముఖం తళుక్కుమంది. బుజాలదాకా వేళ్ళాడే లోలకులూ. తాంబూలంతో ఎరుపెక్కిన పెదిమలూ, కాటుక కళ్ళూ—ఎంతో అందవికారంగా అనిపించింది నాకు. ఇటువంటి మనిషికోసం బావ నన్ను మరిచిపోయి నాకు దూరమౌతున్నాడనే బాధ గుండెల్లో భగ్గుమంది. ఆ మనిషి పలచటి వల్లెవాటులోంచి లావణ్యాన్ని కుమ్మరించే విరుపులతో కులుకుతో ఆడుతోంది. అప్రయత్నంగా గూట్లోవున్న బాకు తీసుకుని గురిచూసి విసిరాను. దూసుకుపోయి ఆ బాకు తడకలో దిగబడిపోయింది. "ఇందుకేనా నన్నిక్కడికి తీసుకొచ్చావ్ ?" అంటూ ఆ మనిషి వగలమారి ఏడుపు సాగించింది. నాయుడుబావ ప్రళయరుద్రుడై లేచాడు. తడికకు గుచ్చుకున్న బాకు చరాలున తీశాడు. ఉప్పెనలాగా విరుచుకు పడ్డాడు. కళ్ళు నిప్పులు కక్కినయ్. తళతళ మెరిసేబాకు అతని బిగించిన పిడికిట్లో ఎంత పదునెక్కిందో....ఏం జరిగిందో తెలియదు .... ఆఖరికి ఇక్కడికి ఎల్లావచ్చానో .... ఎప్పుడువచ్చానో.... ఈ లోకమే చాలా బాగుంది. మీలోకంలో అమృతమూ వుంది హాలాహలమూ వుంది. కాని ఇక్కడో అదీలేదు....ఇదీలేదు....ఏమీలేదు—లేదు" అంటూ నిస్పృహగా నవ్వింది. ఆనవ్వు ఘూనబోంతరాళాలని గింగురుమనిపించి దూరమై, ఇంకా దూరమై అంతులేని మహా

మౌనంలో కలిసి కరిగిపోయి నట్లయింది. ఆ వంచితప్రణయిని హృదయవేదన నా కళ్లలో అశ్రువులుగా చిందించి అర్థం కాని బాధని రగిలించింది.

వెనక్కి తిరిగి చూద్దునుకదా క్లాసు క్లాసంతా నా చుట్టూ నిలబడివున్నారు. నా ఖాళీనోట్‌బుక్ కేసి చూసి అంతా పగల బడి నవ్వుతున్నారు. "నీలాంటివాడు ఇక్కడ లాభంలేదు?" అన్నట్లుగా ప్రొఫెసరు చూపులలో మందలింపు ధ్వనించింది. తోటి విద్యార్థుల హేళనలూ నవ్వులూ నన్ను అక్కడినించి తరుముతున్నట్లుగా తోచింది.

మర్నాడే మెడికల్ కాలేజికీ, అస్థి పంజరాలకీ, వాసనకొట్టే శవాలకీ సలాంకొట్టి ఇంటికి తిరిగి వెళ్ళాను. "అష్టకష్టాలుపడి సీటు సంపాదిస్తే ఇదేమిట్రా నిర్వాకం? ఏంచేస్తాంలే? అదృష్టం అందలం ఎక్కిస్తేమటుకు బుద్ధి బురద గుంటలోకి ఈడుస్తుంటే నువ్వే చేస్తావులే?" అని మా తాతయ్య కసితీరా చీవాట్లు వేశాడు.